సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఆర్‌బికెల ద్వారా రైతుకు మెరుగైన సేవలు

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఆర్‌బికెల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని, ప్రకృతి వ్యవసాయంపై మరింత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అరుణ్ బాబు, వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు శంకర్ నారాయణ, సిద్ధారెడ్డి, తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రాలు, మండల, జిల్లాస్థాయి సమావేశాలు తప్పనిసరిగా ప్రతినెలా నిర్వహించాలన్నారు. రాబోయే సీజన్లో రైతులకు మేలు చేసే విధంగా ఎలాంటి కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని అనేది ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. నీటిపారుదల సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పాటు ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అధికారులందరూ సమన్వయంతో రైతులకు మేలు చేయాలన్నారు. జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రైతుల పక్షపాతి అన్నారు. ఎప్పుడూ లేని విధంగా రైతులకు అండగా ఉంటున్నారన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్, సిరికల్చర్ జెడి పద్మమ్మ, మార్కెటింగ్ శాఖ అధికారి నరసింహమూర్తి, వ్యవసాయ పరిశోధన కదిరి శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల క్రీడా పోటీలు

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక జడ్పి హైస్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. హెచ్‌ఎం పద్మజ పోటీలను ప్రారంభించారు. అండర్-14, 17 బాల బాలికలకు వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్, టెన్నికాయిట్, పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మండలంలో వివిధ పాఠశాలల నుంచి 300 మంది పాల్గొన్నారు. అండర్-17 విభాగంలో వాలీబాల్ జట్టుకు 12 మందిని, త్రో బాల్ జట్టుకు 10మందిని, ఖోఖో జట్టుకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్-14 బాలికల విభాగంలో కెజిబివి నుంచి ఐదుగురు, పెద్దమంతూరు హైస్కూల్ నుంచి ముగ్గురు, నారానాగేపల్లి నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. అండర్- 17 బాలికల విభాగంలో కెజిబివి నుంచి ఏడుగురు, పెద్దమంతూరు నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. అండర్- 14 వాలీబాల్ జట్టుకు 10మంది, త్రో బాల్ బాలికల జట్టుకు 12 మంది ఎంపికైనట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పిడి రమేష్, రామకృష్ణ, శ్రీదేవి, బాలాజీనాయక్, పిఈటి మహేష్, రాధ, ఉపాధ్యాయులు, రాజశేఖర్, నరహరి, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలో తలపడిన క్రీడాకారులు

టమోటా రైతుకు..

నష్టాలే మి(ది)గులు..!

◆ మొన్న నో స్టాక్- నేడు నో సేల్ ◆ టమోటా రైతు ధరలేక విలవిల

టమోటాకు ధర లేక అనంతపురం బైపాస్ రోడ్డులోని నడిమివంకలోకి టమోటాలను పారేస్తున్న రైతు..

నార్పల వద్ద రోడ్డు పక్కన పారవేసిన టమోటాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మొన్నటి వరకు మంచి ధర ఉందని ఆనందించిన టమోటా రైతుకు మళ్లీ నిరాశే మిగులుతోంది. పంట కోతకు పెట్టిన పెట్టిబడి కూడా మిగలడం లేదు.. అరుగాలం కష్టపడి పండించిన మార్కెట్‌కు తీసుకొస్తే నో సేల్ అంటున్నారు. దీంతో చేసేది లేక టమోటా పంటను రోడ్లలోనే పడేసి వెనుదిరిగే పరిస్థితి జిల్లాలో నెలకొంది. అనంతపురం జిల్లాలో బోరుబావుల కింద టమోటా సాగు పెద్దఎత్తునే ఉంటోంది. ఈ ఏడాది ఆగస్టు వరకు మంచి ధర ఉండటంతో మరింత మంది రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. అయితే ధర పడిపోవడంతో రైతుకు నష్టాలే మిగులుతున్నాయి.

గతేడాది కంటే తక్కువైనా ధర లేదు..

గతేడాదితో పోలీస్తే పంట సాగు చూసుకున్నా, మార్కెట్‌కు వస్తున్నా దిగుబడులు చూసుకున్నా చాలా తక్కువగానే ఉంది. కానీ ధర మాత్రం చాలా తక్కువగా ఉండటం గమనార్హం. గతేడాది ఈ సమయానికి అనంతపురం జిల్లాలో 60 వేల ఎకరాల్లో టమోటా పంటసాగైంది. ఈసారి కేవలం 11,500 ఎకరాల్లోనే సాగైంది. పంట సాగు తక్కువ అవడమే కాకుండా మార్కెట్‌కు వస్తున్న సరుకు చూసుకున్నా చాలా తక్కువనే చెప్పాలి. గతేడాది ఈ సమయానికి రోజుకు నాలుగు లక్షల బాక్సులు అనంతపురం రూరల్‌లోని కక్కలపల్లి మార్కెట్‌కు వస్తుండేవి. ఇప్పుడు ఈ మార్కెట్‌కు వస్తున్న టమోటా కేవలం ఒకటిన్నర లక్ష బాక్సులు మాత్రమే. ఇంత తక్కువగా పంట వస్తున్నా ధర మాత్రం ఉండటం లేదు.

పంట కోతకు రూ.5500... మార్కెట్‌లో అమ్మితే వచ్చింది రూ.5000...

ఆత్మకూరు మండలం పంపనూరు తండాకు చెందిన రామకృష్ణా నాయక్ తనకున్న ఒకటిన్నర ఎకరా పొలంలో టమోటా సాగు చేశాడు. ఇప్పుడు ఈ పంట కోతకు వచ్చింది. రెండు రోజు క్రితం రామకృష్ణా నాయక్ టమోటా పంట కోత కోసి మార్కెట్‌కు తీసుకొచ్చాడు. వస్తే పంట పెట్టుబడి ఎలాగున్నా... కనీసం పంటకోసి మార్కెట్‌కు తెచ్చిన ఖర్చు కూడా చేతికి రాలేదని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన చెప్పిన లెక్కల ప్రకారం పంట కోయగా వచ్చిన దిగుబడి వంద బాక్సులు అయ్యాయి. బాక్సుకు 15 కిలోలు. ఈ బాక్సులకు ఒక్కో దానికి రవాణా ఖర్చు పంనూరు తండా నుంచి మార్కెట్‌కు రూ.16 చొప్పున 100 బాక్సులకు రూ.1600 ఖర్చు వచ్చింది. ఇక బాక్సు బాడుగ ఒక్కో దానికి మూడు రూపాయల చొప్పున రూ.300 బాక్సుల బాడుగ. దింపడానికి హామీలీ ధర ఒక్కో బాక్సు రూపాయి. చొప్పున వంద రూపాయలు. ఇక తోటలో కాయలు కోయడానికి ఒక్కో కూలీకి రూ.300 చొప్పున పది మందికి రూ.3000. ఇక మార్కెట్‌లో అమ్మినందుకు పది శాతం కమిషన్ కలిపి మొత్తం రూ.5500 అయ్యింది. మార్కెట్‌లో బాక్సు రూ.50 చొప్పున అమ్ముడుపోయింది. దీనికి ఆ రైతుకు వచ్చింది రూ.5000. ఇంకా చేతి నుంచి రూ.500 రైతుకు పడింది. ఆరుగాలం కష్టపడిన రైతుకు మిగిలింది రూ.500 అదనపు ఖర్చు. ఇక అది కూడా కొనకపోతే బయటపడేసే రైతుకు మొత్తం నష్టమే మిగులుతోంది.

ఉత్తరాదిలో పంట అధికంగా వచ్చింది

ఉత్తరాది రాష్ట్రాల్లో పంట దిగుబడులు అధికంగా వచ్చాయి. దీంతో ఇక్కడి నుంచి వెళ్లాల్సిన సరుకు బయటకు వెళ్లటం లేదు. దీంతో మార్కెట్‌కు ముందు కంటే తక్కువ సరుకు వచ్చినా మిగిలిపోతోంది. అక్కడ వర్షాలొస్తున్నాయి. ఆ సమయంలో పంట దెబ్బతినే పరిస్థితులున్నాయి. అక్కడ పంట తగ్గితే ఇక్కడ ధర పెరిగే అవకాశముంది. సరుకు బయటకు వెళ్లకపోవడంతోనే ధర పడిపోతోంది.

రమణ, టమోటా వ్యాపారి.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా తక్షణమే సహాయక చర్యలు చేపట్టి రైతులు, ప్రజలను ఆదుకోవాలని రాయలసీమ అభివృద్ధి వేదిక, అనంత ప్రజా, పౌర సంఘాల కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అనంత ప్రజా పౌర సంఘాల ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టర్ ఎం.గౌతమి, శ్రీసత్యసాయి కలెక్టర్ పి.అరుణ్‌బాబులకు వాట్సప్ ద్వారా విజ్ఞాపన పత్రాలు పంపారు. కరువు జిల్లాలుగా ప్రకటించాల న్నారు. రెండేళ్లలో కురిసిన అధిక వర్షాలతో మెట్ట పంటలతో పాటు, ఉద్యాన పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం పంటబీమా పథకాల ద్వారా రైతులకు పరిహారం సకాలంలో అందించినప్పటికీ రైతులకు జరిగిన నష్టాలను పూర్తిగా పూడ్చలేకపోయారన్నారు. ఈ ఖరీఫ్‌లో జులై- ఆగస్టులో వర్షా లు ఆలస్యంగా కురవడమే కాకుండా సగటు వర్షపాతానికి 30-40 శాతం లోటు వర్షపాతం నమోదైందన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో కురుస్తున్న వర్షాలతో పశువుల మేత ఉపయోగపడుతుంది తప్పా పంటలు పండే అవకాశం ఉండదన్నారు. కరువు ఏర్పడిందని, తక్షణమే ప్రభుత్వానికి కరువు నివేదికలు పంపి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తేనే పంటలు పండిచే అవకాశం ఉందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ కోతలు లేకుండా చూడాలన్నారు. రైతులు అప్పులు చేసి వ్యవసాయం పంటలు సాగు చేస్తున్నారని, పంటలు దిగుబడి రాకపో వడంతో చేసిన అప్పులు తీర్చలేక 2023 జనవరి నుంచి 25 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఆ కుటుంబాలను ఆదుకోవాల న్నారు. కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. పంట నమోదు కార్యక్రమంలో భూయజమానులతో సంబంధం లేకుండా వాస్తవంగా పంటలు సాగు చేస్తున్నారో ఆ సీజన్‌కు వారిని కౌలు రైతులుగా గుర్తించాలని కోరారు. కరువు ఏర్పడిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలకు 90 శాతం రాయితీతో రైతులకు విత్తనాలు సరఫరా చేయాలని కోరారు. బ్యాంక్ రుణాలపై మారిటోరియం ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కరువు పరిస్థితుల కారణంగా గ్రామీణ ఉపాధి పనిదినాల సంఖ్యను పెంచాలన్నారు. గొర్రెల పెంపకం దారులకు నీటి వసతి కల్పించాలని కోరారు. అటవీ ప్రాంతాలకు దగ్గరగా బోర్లు వేసి నీటి మడుగులు ఏర్పాటు చేయాలన్నారు.

కల్తీ కల్లు బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి-పెనుకొండ

మండల పరిధిలోని నాగులూరు, బండ్లపల్లి గ్రామాల్లో కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురైన బాధితులను బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపకులు, హైకోర్టు నాయవాది శివరామకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం ఆయా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ కల్లు తాగి గ్రామంలో అస్వస్థతో బాధపడుతున్న వారి కోసం డిప్యూటీ డిఎంహెచ్‌ఒతో మాట్లాడి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయించామని తెలిపారు. ఈ సంఘటనకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు గ్రామాల్లో కల్లు దుకాణం తీసివేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలతను డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు వెంకటేష్, కౌన్సిలర్ శేషాద్రి, సోమందేపల్లి సూరి, పెనుకొండ రవికుమార్, తిమ్మాపురం నరసిం హులు, మునిమడుగు నరసింహులు, పెదబల్లి వెంకటేష్, రంగేపల్లి మూర్తి, శెట్టిపల్లి నరసింహులు, రాంపురం రామాంజి, తిమ్మాపురం గంగన్న, ఉన్నారు. కల్తీ కల్లు తాగి అస్వస్థతకు గురై పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పరామ ర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి జివిపి నాయుడు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చిన్న వెంకటరాముడు, జిల్లా యాదవ సాధికార కన్వీనర్ కేశవయ్య, జిల్లా అధికార ప్రతినిధి రఘువీరాచౌదరి, పట్టణ కన్వీనర్ రవిశంకర్, నియోజకవర్గ ఉపాధ్యక్షులు రామలింగ, లక్ష్మినారాయణరెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోయ గాయత్రి, సూర్యనారాయణరెడ్డి, జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి జావిద్, మండల తెలుగు రైతు అధ్యక్షులు పోతిరెడ్డి, శివ, రాజు ఉన్నారు.

కల్తీ కల్లు బాధితులను పరామర్శిస్తున్న శివరామకృష్ణ

రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీల్లో పులమతి విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-లేపాక్షి

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రాణించిన విద్యార్థులు

మండల పరిధి లోని పులమతి జడ్పి హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న ధనుష్ సబ్ జూనియర్ బాలుర(13ఏళ్ల లోపు) రాష్ట్రసాయి పోటీల్లో సత్యసాయి జిల్లా తరపున పాల్గొని సత్తా చాటాడు. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతపురంలో జరిగిన బాలికల సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వైష్ణవి, చైతన్య, మేఘన, అఫీఫా ప్రతిభ కనబరిచారన్నారు. వీరి జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని పిడి రామాంజనేయులు తెలిపారు. క్రీడాకారులను హెచ్‌ఎం జివి సుబ్బారావు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

'మాధవ్‌ను చూసి ప్రజలు సిగ్గుతో తలవంచుకుంటున్నారు'

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి

ప్రజాశక్తి-పెనుకొండ

మాధవ్ నిన్ను ఎన్నుకున్న హిందూపురం పార్లమెంటు ప్రజలు నిన్ను చూస్తే సిగ్గుతో తలవంచుకుంటు న్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' నినాదంతో అనంతపురం జిల్లాలో పర్యటించిన సందర్భంలో ఏదో మాట్లాడాడని హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ నోటికొచ్చినట్లు మాట్లాడాన్నారు. మాధవ్‌ను వారి పార్టీ చెత్తగా పరిగణించి పక్కన పెట్టారని తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. వైసిపిలో ఎవరికీ క్రమశిక్షణ లేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు జివిపి నాయుడు, రామకృష్ణప్ప, కేశవయ్య, మునిమడుగు వెంకటరాముడు, రఘువీరాచౌదరి, రామలింగ నాయుడు, లక్ష్మీనారాయణరెడ్డి, జావీద్, పోతిరెడ్డి, పట్టణ కన్వీనర్ రవిశంకర్, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా సమీక్ష

◆ పెనుకొండ నియోజకవర్గంపై సమావేశం
◆ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జయరాం హాజరు
◆ గంటలో ముగిసన సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జయరాం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షా సమావేశాలను ఇటీవల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పుట్టపర్తి కలెక్టరేట్లో పెనుకొండ నియోజకవర్గం అభివృద్ధిపై కలెక్టర్ అరుణ్‌బాబు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ సమావేశాన్ని గంటలోపు ముగించేశారు. సమస్యలపై కనీస ప్రస్తావన లేకుండా నామమాత్రంగా సమావేశాన్ని నిర్వహించి మమ అనిపించారు. 10 గంటలకు ప్రారంభం అవ్వాల్సిన సమావేశం మంత్రి జయరాం ఆలస్యంగా రావడంతో 12 గంటలకు మొదలైంది. అలా సమావేశాన్ని ప్రారంభించి గంట వ్యవధిలోనే సమావేశం ముగించుకుని మంత్రి వెళ్లిపోయారు. సమావేశంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పెనుకొండ శాసనసభ్యులు శంకర్ నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, కలెక్టర్ అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డిఆర్‌ఒ కొండయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్నారు. నియోజకవర్గంలో అభివద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గం అభివద్ధిలో భాగంగా మెడికల్ కళాశాల మంజూరు, నేషనల్ హైవే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ ఇతర ప్రభుత్వ శాఖల ద్వారా అభివద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర నారాయణ నియోజకవర్గం అభివృద్ధిపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. గహ నిర్మాణాలపై ఆ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి వివరిస్తూ ఇప్పటివరకు వుడా, పిఎంఎవై అర్బన్ కింద 6741 ఇళ్లు మంజూరు అయ్యాయని, వివిధ దశలో ఆ పనులు జరుగుతున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో 1380 ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. కొత్తగా మరో 3599 ఇళ్లు కావాలని ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రొద్దం మండలంలోని కోగిర గ్రామానికి చెందిన రైతులు ఫారెస్ట్ భూముల్లో సాగు చేస్తున్నారని వాటికి భూహక్కు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. నియోజకవర్గంలో 4 సబ్‌స్టేషన్లు మంజూరు కోసం 13.45 కోట్లతో ప్రతిపాదించామన్నారు. ముదిగుబ్బ కోడూరు నాలుగు లైను నిర్మాణంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెనుకొండపై ఇస్కాన్ టెంపుల్ నిర్మాణంలో భాగంగా విద్యుత్ సరఫరా తదితర మౌలిక సదుపాయాల కల్పనకు పర్యాటక అభివద్ధికి చర్యలు తీసుకోవాలని శంకర్ నారాయణ అధికారులను కోరారు. పెండింగ్‌లో ఉన్న రహదారుల పనులు పూర్తి చేయాలన్నారు. గుడిపల్లి రిజర్వాయర్ నిర్మాణంకు రూ.600 కోట్లు వ్యయంతో 2756 టీఎంసీల నీటి సామర్థ్యం కొరకు తీసుకున్న చర్యలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పిఆర్ ఎస్‌ఇ భూపాల్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కృష్ణారెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి చాంద్ బాషా, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, వార్డు గ్రామ సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని శీనప్పపల్లి గ్రామంలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం గౌనివారి పల్లి ఎంపిటిసి సుకన్య, ఆమె భర్త విజయసింహారెడ్డి రూ. 20వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా విజయసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం పూర్తి చేసి శనివారం(నేడు) విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహిస్తున్నారని తెలిపారు. విగ్రమ ప్రతిష్టాపన మహోత్స వంలో మండలంలోని ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రమణప్ప, గోవిందు, కొండాపురం ఎంపిటిసి జయచంద్రారెడ్డి, కంగారెడ్డిపల్లి నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అవినీతిపై విచారణకు డిమాండ్

మడకశిర : ఉపాధి హామీ చట్టంలో అవినీతి చేసిన అధికారులపై చర్యలు తీసుకుని విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలు వలస పోకుండా స్వగ్రామంలోనే జీవనోపాధి పొందేందుకు ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చారన్నారు. అయితే కొందరు అధికారులు ఉపాధి హామీ ముసుగులో అవినీతికి పాల్పడ్డారని, అలాంటి వారిని వెంటనే విధుల నుంచి తొలగించాలని, ఉపాధి హామీ పనులపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అర్హులకు పని కల్పించాలి కోరారు.

'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'పై అవగాహన

ప్రజాశక్తి-రొద్దం

'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోదామని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆర్.మరువపల్లిలో శుక్రవారం పార్థసారథి ఆధ్వర్యంలో ఆయన నివాసంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంపై ట్రైనర్స్ ఆనంద్, వెంకటరమణ, హరిరెడ్డి బూత్ కన్వీనర్లు, పంచాయతీల నాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అందించే పథకాలపై ఇప్పటి నుంచే ప్రజలకి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, సీనియర్ నాయకులు రామకృష్ణ, సర్పంచులు బీదనపల్లి మంజు, నాగరాజు, మంజు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

ప్రజాశక్తి
www.prajasakti.com

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పైపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇల్లు తిరిగి సర్వే చేస్తూ అప్రమత్తంగా వుండాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి ప్రవీణ్ కుమార్, సిహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్ వెంకట రమణ, చంద్రకళ పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, ఎంఎల్‌హెచ్ లక్ష్మి నారాయణమ్మ ఆరోగ్య కార్యకర్త నాగజ్యోతి, అంగన్వాడీ కార్యకర్త సుజాత, ఆశ కార్యకర్త చెన్నకృష్ణమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

తనకల్లు : రవాణా రంగ కార్మికుల కోసం ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 16 17 తేదీలలో కర్నూలులో నిర్వహించే వర్క్ షాపునకు సంబంధించిన కరపత్రాలను సిఐటియు స్థానిక నాయకులు శుక్రవారం విడుదల చేశారు. డ్రైవర్లు రవాణా రంగ కార్మికులు విరాళాలు అందించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు రవాణా రంగం పట్ల చిన్నచూపు చూస్తూ వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నాయని విమర్శించారు.కరోనా కష్టాల నుండి ఇప్పుడిప్పుడే కోరుకుంటున్నా రవాణా రంగాన్ని ప్రభుత్వం పగబట్టినట్లు జీవో నెంబర్ 21 విడుదల చేసి ఇక్కట్ల పనులు చేస్తోందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి డ్రైవర్లకు, కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పిఎఫ్ ఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, 50 సంవత్సరాలు నిండిన డ్రైవర్లకు నెలకు రూ. 6వేల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వివి. రమణ, ఒంటెద్దు వేమన్న, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేద పిల్లలకు నాణ్యమైన విద్య

ప్రజాశక్తి గాండ్లపెంట

నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యను ఆర్డీటీ అందిస్తోందని ఆర్డీటీ ఎటిఎల్ కృష్ణ, ఎఎస్ఒ నాగేంద్ర లు పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో భాగంగా స్థానిక ఆర్డీటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల విద్యాభ్యాసం పట్ల పిల్లల తల్లిదండ్రులు, సిడిపిఒలు, సిబిటిలు బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఒలు నారాయణ, గంగాద్రి, నవీన్, అనిత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చిలమత్తూరు : పౌష్టికాహారంతోనే బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యమని సిడిపిఒ రెడ్డిరమణమ్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం దేమకేతేపల్లిలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సంపూర్ణ పోషణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మినారాయణతో పాటు గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

కదిరి టౌన్ : కదిరి బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటాచలం అధ్యక్షతన మండల స్థాయి పోటీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మండల విద్యాశాఖ అధికారులు చెన్నకృష్ణ, ఓబులరెడ్డి పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఇఒ చెన్నకృష్ణ మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో, స్నేహాభావంతో ఆడాలని తెలిపారు. ఈఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల కో ఆర్డినేటర్ శంకర్ నాయక్, యశోద, సుజాత, పీడీలు రమణ, రవీంద్ర నాయక్, ఆది, ప్రసాద్ నాయక్, శివ, పద్మ, రాజు, కెజిబివి, ప్రైవేట్ పాఠశాల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కదిరి టౌన్ : శ్రావణ మాసం సందర్భముగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉచితము సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం నిర్వహించారు. ప్రధాన అర్చకులు పార్థసారధి చార్యులు, ముఖ్యఅర్చకులు అంజన్ కుమార్ చార్యుల ఆధ్వర్యంలో ఈ వ్రతాలు జరిగాయి. ఈకార్యక్రమములో ఆలయ కమిటి ఛైర్మెన్ జెరిపిటి గోపాల క్రిష్ణ, ఆలయ కార్యనిర్వహణాధికారి వెండి దండి శ్రీనివాస రెడ్డి తో పాటు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సు

నల్లచెరువు : మండల పరిధిలో ఆటోలు, స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లకు ఎస్ఐ వరలక్ష్మి అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు నియమ నిబంధనలకు అనుగుణంగా యూనిఫామ్ ధరించాలని, అలాగే లైసెన్స్ కలిగి ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో ఎక్కించుకోరాదని సూచించారు.అలాగే స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

పార్టీ అభివృద్ధికి కృషి

ధర్మవరం టౌన్‌య: వైసిపి జిల్లా సెక్రటరీగా జిఆర్. రామ్మోహన్ని అధిష్ఠానం ఇటీవల నియమించింది. ఈ సందర్భంగా రామ్మోహన్ స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని శుక్రవారం కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి,కదిరి

O.S.NO:707/2019

Between:

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, Kadiri Main Branch వారు rep by its Senior Manager. Kadiri,

...Plaintiff

మరియు

D2: A.శ్రీరాములు S/o జంబులయ్య, R/at సోమయాజులపల్లి, గాండ్లపెంట మండలం, శ్రీ సత్యసాయి జిల్లా.

...Defendants

పై దావాలోని D2 ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలోని వాది (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు Kadiri Main Branch వారు) ప్రతివాది D2 అయినా మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 21/09/2023 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 21/09/2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మాణించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా: 21/09/2023

జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి

తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వండి: కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

తాగునీటి అవసరాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని అందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా జనరల్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఇందులో పెనుకొండ, కదిరి, మడకశిర, ఎమ్మెల్యేలు శంకర్ నారాయణ, సిద్ధారెడ్డి, తిప్పే స్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, అగ్రిగోల్డ్ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, సంయుక్త కలెక్టర్ టిఎస్ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హంద్రీనీవా ప్రాజెక్టులోని అంతర్భాగమైన గొల్లపల్లి జలాశయం ద్వారా మడకశిర ఉపకాలవకు చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూరు ఉపకాలువకు నీటి విడుదలకు తగిన ప్రణాళికలు అమలు చేయాలని సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. మడకశిర ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు అక్టోబర్ 16 తేదీ లోపల నీటిని విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్యే శంకర్ నారాయణ మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా అన్ని చెరువులకు నీరు నింపాలని, అంతకుమునుపే చెరువులలో పూడిక తీయించాలని కోరారు. జీడిపల్లి జలాశయం నుంచి పేజ్ 11 నీటిని ఈనెల 19వ తేదీన విడుదల చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని శంకర్ నారాయణ కోరారు. కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి మాట్లాడుతూ, చెర్లోపల్లి జలాశయం నుంచి పుంగనూరు ఉప కాలువకు నీటిని అక్టోబర్ 18న నీటిని విడుదలకు కమిటీ తీర్మానించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హంద్రీనీవా ఎస్ఇ దేశే నాయక్, సంబంధిత ఇంజనీర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజా సమస్యలపై జవాబుదారీగా ఉండాలి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారిగా ఉండి సత్వరం పరిష్కరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక 34వ వార్డులో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వార్డులోని పలువురు ప్రజలు సాంకేతిక తప్పిదాల కారణంగా సామాజిక పింఛను, ఇంటిస్థలం తదితర పథకాలు రావడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడి అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించారు. అలానే మరికొంత మంది వార్డులో తాగునీటి సరఫరా 5 రోజులకు ఒకసారి జరుగుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా 2 రోజులకు ఒకసారి సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్ బేగం, కమిషనర్ బండి శేషన్న, వార్డు కౌన్సిలర్ బాలం ఓబుళమ్మ, వార్డు ఇన్‌ఛార్జి బాలం గోపాల్, పట్టణ సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్లతో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌ఛార్జులు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత : ప్రమాదవశాత్తు మతి చెందిన గంటా మల్లి కుటుంబానికి ప్రభుత్వం నుండి మంజూరైన రూ.4.90లక్షల విలువైన పరిహారపు చెక్కును మృతుని భార్య గంటా రామలక్ష్మికి స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అందజేశారు. చిన్నూరు కాలనీకి చెందిన గంటా మల్లి జూన్‌లో ప్రమాదవశాత్తు చెరువులో కాలు జారిపడి మృతిచెందాడు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబానికి మంజూరైన బీమా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సచివాలయాల కన్వీనర్ మానవల్లి సాయికుమార్, జెన్నే సురేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు

ఐటి కేసుల్లో త్వరలో చంద్రబాబు అరెస్టు : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురించి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు నోటికొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, నోటిని అదుపులో పెట్టుకోవాలని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణు రెడ్డి హెచ్చరించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా ఖండించారు. శుక్రవారం వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతు చంద్రబాబు వ్యాఖ్యలను ప్రజలు ముఖ్యంగా మహిళలు అసహ్యించుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా కూడా కొనసాగే అర్హత ఆయనకు లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలుసుకున్న ఆయన ఒక మానసిక రోగిగా మారారని ఎద్దేవాచేశారు. ఆ పార్టీ నేతలు వెంటనే విశాఖ మెంటల్ ఆసుపత్రిలో చేర్పించాలని సలహా ఇచ్చారు. ఐటీ శాఖ నోటీసుల వ్యవహారంలో చంద్రబాబు తప్పు చేసినట్లు స్పష్టమవుతుందన్నారు. చంద్రబాబు రూ.118 కోట్లు ముడుపులు తీసుకున్నట్లు ఐటి శాఖ తేల్చిందన్నారు. అవినీతి బండారం బయటపడటంతో ఆయనకు భవిష్యత్తు కళ్ల ముందు కనిపిస్తోందని, అందుకే తనను అరెస్టు చేయవచ్చని ముందుగానే సానుభూతి కోసం చెబుతున్నారని అన్నారు. చంద్రబాబు విజయమ్మకు భే షరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కుటుంబ వ్యవస్థ పట్ల, మహిళల పట్ల ఇంత నీచంగా మాట్లాడటం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు హంద్రీనీవా కాలువ వద్ద సెల్ఫీ తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

నేటి నుంచి విజయ సంకల్పయాత్ర

విజయ సంకల్ప యాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, నాయకులు

ధర్మవరం టౌన్ : వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించడానికే జనసేనపార్టీ ఆధ్వర్యంలో విజయ సంకల్పయాత్రను శనివారం ముదిగుబ్బ మండలం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను, భూదందాలు, దౌర్జన్యాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయడానికి విజయసంకల్ప యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో రాయలసీమలో వారాహి యాత్ర ఉంటుందని, ఈ యాత్ర వచ్చేలోపు గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విదానాలను ప్రజలకు తెలియజేస్తామని అన్నారు. నియోజకవర్గంలో జగన్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డిపై పోరాటం చేస్తున్నామన్నారు. పట్టణంలోపార్థసారధినగర్ లో ఎమ్మెల్యేను రోడ్డువేయమన్నందుకు సాలమ్మకు పింఛను తొలగించారని దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించిందని అన్నారు. దీంతో కోర్టు ఆదేశాల మేరకు అధికారులు సాలమ్మకు శుక్రవారం పింఛన్ అందజేశారని, ఇది జనసేన పార్టీ విజయం అని అన్నారు.

పురం రైల్వే స్టేషన్‌కు రూ.15కోట్లు మంజూరు

డిఆర్ఎం యోగేష్ మోహన్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వే స్టేషన్ అమృత్ భారత్ స్టేషన్ స్కీముకు ఎంపికైందని దీని ద్వారా స్టేషన్ అభివృద్ధికి రూ.15కోట్ల నిధులు మంజూరు అయ్యాయని బెంగుళూరు డిఆర్ఎం యోగేష్ మోహన్ తెలిపారు. ఈ నిధులతో ప్రయాణికులకు అనువుగా స్టేషన్‌ను ఆధునికరణ చేస్తామని చెప్పారు. ఈ మేరకు ఆయన రైల్వే అధికారులతో కలసి శుక్రవారం హిందూపురం రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్‌తో పాటు రైల్వే అసుపత్రి, పాఠశాల, ఉద్యానవనం, రన్నింగ్ రూం ఇతర విభాగాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డిఒఎం కృష్ణారెడ్డి, సీనియర్ డిసిఎం కృష్ణ చైతన్య, డిఇఇ పూజా, కమార్షియల్ ఇన్స్‌పెక్టర్ సోమప్ప, స్టేషన్ మేనేజర్ జయప్రకాష్ జ్యోతి, శ్రీ కాంత్ దాస్, ఆనంద్, కిరణ్ ఇతర విభాగాల అధికారులు, స్థానిక రైల్వే స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి : హిందూపురం రైల్వే స్టేసన్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణు రెడ్డి డిఆర్ఎం యోగేష్ మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలన్నారు. అదే విధంగా హిందూపురం నుంచి విజయవాడ వెళ్లడానికి ఒక్క రైలే మాత్రమే పూర్తి స్థాయిలో ఉందని, వారంలో మూడు రోజులు నడిచే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు ప్రతి రోజు తిరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో పాటు యశ్వంత్ పుర్ నుంచి హిందూపురం వస్తున్న రైలును అనంతపురం వరకు నడిచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొంటామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షాజియా, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హత మాధవ్‌కు లేదు

కొత్తచెరువు : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుని విమర్శించే అర్హత హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌కు లేదని టిడిపి స్థానిక నాయకులు అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామకృష్ణ మాజీ సర్పంచి హరినాథ్ చౌదరి, బోయ రాజు, శివ, సుబ్బరాయుడు మాట్లాడారు. చంద్రబాబును తీవ్ర పదజాలంతో విమర్శించడం రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం గోరంట్ల మాధవ్‌కు తగదన్నారు. గోరంట్ల మాధవ్ చేసిన తప్పులు అందరికీ తెలుసని ఇతరులను విమర్శించేముందు ఆయనేదో తెలుసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు సూర్యప్రకాష్, సోహెల్ పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే

ధర్మవరం టౌన్ : నిరుద్యోగులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి వారి ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు తహశీల్దార్ యుగేశ్వరి దేవి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ శంషాద్ బేగం, డిఆర్‌డిఎ రామేశ్వర్ రెడ్డి, ఎపిఎం రఘునాథరెడ్డి, జెడిఎం సూర్యనారాయణ, ప్రిన్సిపల్ లక్ష్మి కాంత్ రెడ్డి, శ్రీ సత్య సాయి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో అన్ని జిల్లాలలో జాబ్ మేళా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్నారన్నారు. ఇలాంటి జాబ్‌మేళాలతో అర్హతకు తగ్గ ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులను చదివి, చక్కటి ఉద్యోగం సాధించాలన్నారు. ఈ జాబ్ మేళాకు 387 మంది హాజరుకాగా అందులో 177 మంది ఎంపిక అయ్యారు.

టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్ర భవిష్యత్తు టిడిపితోనే సాధ్యమని ఆపార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ అన్నారు. భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ కార్యక్రమాన్ని స్థానిక 29వ వార్డులో పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మినీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కటిక ఖాదర్‌బాషా, టిఎన్‌టియుసి నాయకులు సిరాజ్, ఇంతియాజ్, అలీఖాన్, తెలుగు యువత ఉపాధ్యక్షులు షాకీర్, రియాజ్, సోహెల్, రిహాన్ అప్రోచ్ దాదు తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై విద్యార్థులకు అవగాహన

ధర్మవరం టౌన్ : అవయవ దానంపై పట్టణంలోని శ్రీసాయిడిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో అమ్మ బాడీ ఆర్గాన్ ఐ డొనేషన్ ఆర్గనైజేషన్ ప్రమోటర్స్ పౌండర్ గంజి ఈశ్వర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు అవయ దానం చేయవచ్చన్నారు. ముఖ్యంగా గుండె, నేత్ర, రక్తదానం వంటివి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ చీఫ్ అడ్వైజర్ పెన్న సుబ్బరాజు, ఆప్తమలిక్ అసిస్టెంట్ సికిందర్ సాయి, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు,పాల్గొన్నారు.

డీజిల్ మాఫియాకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

శ్రీ సత్య సాయి జిల్లాలో డీజిల్ మాఫియా జరుగుతోందని అందుకు సహకరిస్తున్న వాణిజ్య శాఖ పౌరసరఫరాల అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం స్థానిక నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో తిప్పేనాయక్‌కు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు పెద్దన్న, ఎస్‌హెచ్. బాషా, సిపిఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున, సిఐటియు మండల కార్యదర్శి ఆదినారాయణ, వెంకటస్వామి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే విధంగా డీజిల్ బంక్‌ల యాజమాన్యాలు ఒక మాఫియాగా ఏర్పడ్డాయని విమర్శించారు. సుమారు రూ. 100 కోట్ల కుంభకోణం చేస్తున్నారని అన్నారు. డీజిల్ మాఫియాకు ప్రభుత్వ అధికారులు, ఆర్టీసీ, సిటిఒ, సివిల్ సప్లై అధికారులు సహకరిస్తున్నారని విమర్శించారు. ధర్మవరానికి సంబంధించిన మణికంఠ డీజిల్ బంకు ద్వారా రూ. 3.82 లక్షల లీటర్లు కొనుగోలు చేసినట్లు బిల్లులు చూపించారని అయితే ఇందులో ఒరిజినల్ బిల్లులు 1.26 వేల లీటర్ల మాత్రమే అని అన్నారు. అదేవిధంగా పెనుగొండ సంబంధించి సాయి కిషన్ డీజిల్ బంకు వారు, హిందూపురానికి సంబంధించి పాండురంగ రవి ఎంటర్ప్రైజెస్ తదితరులు ఇలాంటి నకిలీ బిల్లులు సమర్పించి వందకోట్ల రూపాయల స్కామ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి ధర్మవరం పట్టణ వ్యాప్తంగా ఉన్న పెట్రోల్, డీజిల్ బంకులను పర్యవేక్షణ చేసి, ఎలాంటి స్కాములు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ డీజిల్ మాఫియా కు పాల్పడిన వారిపై విచారణ జరిపి దోషులను శిక్షించి, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

హిందూపురం : డీజిల్ మాపియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై తహశీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ఆందోళన చేసి తహశీల్దార్ హసీనా సుల్తానకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జెడ్పీ శ్రీనివాసులు, రాము, రాజప్ప, రమణ, బాబా, మధు, తంతాధర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఎద్దుల బండిని ఢీకొన్న ప్రయివేటు బస్సు

ప్రజాశక్తి బత్తలపల్లి

మండల పరిధిలోని రామాపురం వద్ద అనంతపురం- కదిరి జాతీయ రహదారిపై శుక్రవారం ఎద్దుల బండిని ప్రవేట్ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఒక ఎద్దు గాయపడింది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన రైతు సంజీవరెడ్డి కుమారుడు హనుమంతరెడ్డి స్థానికంగా ఉన్న చిత్రావతి నదిలోకి ఇసుక తీసుకువచ్చేందుకు ఎద్దుల బండిలో వెళుతున్నాడు. రామాపురం క్రాస్ వద్దకు ఎద్దుల బండి రోడ్డు మీదకు రాగానే అనంతపురం నుంచి తిరుపతికి వెళుతున్న ప్రవేట్ బస్సు ఎద్దుల బండిని వెనుక వైపు నుంచి ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఎద్దుల బండి ఎగిరిపడి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రైతు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఎద్దులు కూడా తీవ్రంగా గాయపడి రోడ్డుపైనే పడిపోయాయి. ఎద్దుల బండి కూడా దెబ్బతింది. స్థానికులు వెంటనే 108 వాహనంలో రైతు హనుమంతరెడ్డిని ఆర్టీటీ ఆసుపత్రికి తరలించారు. 1962 పశువుల అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో పశువైద్యులు గుర్నాథరెడ్డి, దివ్యసాలతో పాటు గోపాలమిత్రలు అక్కడికి చేరుకుని పశువులకు వైద్యం అందించారు. ఇందులో ఒక ఎద్దు పరిస్థితి విషమంగా ఉందన్నారు. బస్సును అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.

దోర్నాలపల్లిలో చోరీ

చిలమత్తూరు : మండల పరిధిలోని దోర్నాల పల్లిలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన చెందిన నరసింహప్ప కుటుంబంతో కలసి ఈనెల 5 వ తేదీన తమ బందువుల ఇంట్లో జరిగే శుభకార్యక్రమానికి వెళ్లాడు. 6 వ తేదీన మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులకు ఉన్న తాళం పగలకొట్టి ఉంది.ఇంటిలోకి వెళ్లి చూడగా 3.8 తులాల బంగారు చోరికి గురైందని తెలుసుకున్న నరసింహప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో 7 వ తేదీన క్లూస్ టీం అధికారి ప్రదీప్ క్లూస్ ను సేకరించారని ఎస్ఐ తెలిపారు. త్వరలోనే కేసును ఛేదిస్తామని ఎస్ఐ చెప్పారు.

384 బస్తాల రేషన్ బియ్యం సీజ్

ముదిగుబ్బ మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండాలో నారునాయక్ ఇంటి వెనుక ఖాళీ ప్రదేశంలో అక్రమంగా నిల్వ ఉంచిన 384 బస్తాల రేసన్ బియ్యాన్ని సీజ్ చేశారు. ఎస్ఐలు శేషగిరి, జయపాల్ రెడ్డి, ఫణింద్రనాథ్ రెడ్డి, ఎఇఇ పుల్లారెడ్డి, రెవిన్యూ సిబ్బంది బియ్యాన్ని సీజ్ చేశారు. సీజ్ చేసిన బియ్యాన్ని సిఎస్‌డిటి మునిస్వామికి స్వాధీన పరిచారు. నిందితులైన రమేష్ నాయక్, ఇస్లావత్ రామంజి నాయక్‌పై కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

పాముకాటుతో పాడిఆవు మృతి

చిలమత్తూరు : మండల పరిధిలోని కమ్మయ్యగారిపల్లిలోని రైతు నాగిరెడ్డి చెందిన పాడి ఆవు పాము కాటుకు గురై శుక్రవారం మృతిచెందింది. గడ్డి వామిలో గడ్డి మేస్తుండగా పాము కాటు వేసిందని బాధితుడు నాగిరెడ్డి తెలిపారు. వెంటనే పశువుల అంబులెన్స్ ను సంప్రదిస్తే వారు రాలేదన్నారు. దీంతో ఆవు మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను రూ. 75 వేలు పెట్టి ఈ మధ్యనే కొనుగోలు చేశానని తనకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

ప్రయివేటు పాఠశాలల బస్సులు తనిఖీ

గాండ్లపెంట : మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలల బస్సులు ఆటోలను ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ డ్రైవర్లు వాహన ఆర్సీలు, వాహన, వ్యక్తిగత లైసెన్సులు పరిశీలించారు. పాఠశాలలకు విద్యార్థులు సక్రమంగా తీసుకుపోవాలని సూచించారు. ఆటోలు ఓవర్ లోడ్ వేసుకోకుండా ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జమేదారు శ్రీనివాసులు, సిబ్బంది బాలాజీ నాయక్, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బుక్కపట్నం : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని ఇస్తాయని విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాముదుర్తి, బుక్కపట్నం, సిద్దరాంపురం, మారాల, కృష్ణాపురం కెజిబివి గర్ల్స్ హై స్కూల్ , మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థినులకు అండర్ 14, 17 విభాగంలో వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, కబడ్డి జట్లను ఎంపిక చేశారు.. ఈ కార్యక్రమంలో పీడీలు నాగరాజు, రమేష్ , వెంకటరమణ, నాగ దీపిక, ఉష, స్వర్ణ , షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి శివ ప్రసాద్ , అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కదిరి టౌన్ : నంబులపూలకుంట మండలం గౌకనపల్లికి చెందిన వైసిపి వార్డు మెంబర్ కొవ్వూరి వీరనారాయణ కుమారుడు కొవ్వూరి వెంకటరమణ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పి వి సిద్ధారెడ్డి స్థానిక ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. తక్షణసాయంగా రూ.10 వేల రూపాయల అందజేశారు.

మానవ అభ్యున్నతికి అక్షరాస్యతే మార్గం

హిందూపురం : మానవ అభ్యున్నతికి అక్షరాస్యతే మార్గమని స్థానిక సప్తగిరి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ శివశంకరరెడ్డి అభిప్రాయ పడ్డారు. ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ యునెస్కో 1967 ప్రారంభించిన ఈ అక్షరాస్యతా దినోత్సవాన్ని ప్రతిఏటా జరుపు కుంటున్నామన్నారు. అక్షరాస్యత శాతాన్ని దేశంలో గణణీయంగా పెంచడానికి కృషి జరుగుతోందన్నారు. కళాశాల పాలన అధికారి గంగ రెడ్డి మాట్లాడుతూ మనిషి విలువ పెరగడానికి అక్షరాస్యత ప్రధాన కారణమన్నారు. ఈ సమావేశంతో ఎన్ఎస్ఎస్ పిఒలు పార్థసారథి, కేశవరెడ్డి విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు కార్మికులకు అండగా ఉంటాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట పారిశ్రామిక వాడలోని గురునానక్ పరిశ్రమలో పని చేసే కార్మికులకు యాజమాన్యం న్యాయం చేసే వరకు వారికి అండగ ఉంటామని జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్, బిఎస్‌పి నాయకులు శ్రీరాములు అన్నారు. న్యాయం కోసం గురునానక్ పరిశ్రమ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారానికి 5వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలు కార్మికులకు జనసేన, బిఎస్‌పి నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్, జనసేన నాయకులు శంకరన్న, బాబు, రామకష్ణ, నవీన్, నారాయణస్వామి, కుమార్, శ్రీకాంత్, బీఎస్పీ నాయకులు చౌలూరు రామాంజనప్ప, హరి, ఆదినారాయణ, చౌలూరు చిన్నప్ప, ఈశ్వరప్ప, పరిశ్రమ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

కల్తీ కల్లు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కల్తీ తాగి అస్వస్థతకు గూరై హిందూపురం ప్రభుత్వ అసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని కెవిపిఎస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పెనుకొండ నియోజకవర్గంలో కల్తీ కల్లు వ్యాపారులను ఎక్సైజ్ అధికారులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు రాము, మధు, గంగాధర్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పూర్తయ్యాక భూ హక్కు పత్రం

బత్తలపల్లి : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా చేపడుతున్న రీ సర్వే ద్వారా ఎలాంటి అవకతవకలకు తావుండదని తహశీల్దార్ యుగేశ్వరిదేవి అన్నారు. మండలంలో జరుగుతున్న భూ సర్వేలో భాగంగా శుక్రవారం బత్తలపల్లిలో ఆమె తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రీ సర్వే జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరి భూమి సర్వే చేయడం జరుగుతుందని. ప్రభుత్వ ఆస్తులు, ప్రవేట్, బహిరంగ స్థలాలను గుర్తించనున్నట్లు తెలిపారు. సర్వే పూర్తయ్యాక డిజటలైజ్డ్ పద్ధతిలో క్యూఆర్ కోడ్‌తో భూహక్కు పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున రైతులు సహకరించి 'భూసర్వే చేయించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ ప్రతాప్, రైతులు తదితరులు పాల్గొన్నారు.